పూర్వవిద్యార్థికి ఆర్థికసాయం అందజేత

ఆర్థికసాయం అందజేస్తున్న తిరుపతిరెడ్డి

మక్తల్, సెప్టెంబర్ 22 : క్యాన్సర్‌తో బాధపడుతున్న పూర్వ విద్యార్థికి మెరుగైన చికిత్స కోసం ఆర్థికసాయం అందజేసినట్లు కృష్ణవేణి టాలెంట్ స్కూల్ డైరెక్టర్ తిరుపతి రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ సంగంబండకు చెందిన అనిల్ కొంతకాలంగా క్యాన్సర్‌తో బాధపడుతున్నాడన్నారు. విషయం తెలుసుకున్న పాఠశాల డైరెక్టర్లు సత్తార్, అబ్దుల్ వహీద్ సహకారంతో మెరుగైన చికిత్స కోసం రూ.లక్షా25వేలు బాధిత కుటుంబానికి అందజేసినట్లు వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ భాస్కర్‌గౌడ్, సిబ్బంది మాధవి, మాజీ ఎంపీటీసీ బలరాం రెడ్డి, గ్రామస్తుడు చిన్నారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పత్తి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

పత్తి పంటను పరిశీలిస్తున్న జలసాధన సమితి జిల్లా కోకన్వీనర్ నర్సింహ

ఊట్కూర్, సెప్టెంబర్ 22 : వర్షాలతో పంటలు పాడైన పత్తిరైతులకు ప్రభుత్వం ఆర్థికసాయం అందించి ఆదుకోవాలని జలసాధన సమితి జిల్లా కోకన్వీనర్ నర్సింహ డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన బిజ్వారం, అవసలోనిపల్లి, మగ్దూంపూర్ గ్రామాల్లో పత్తిపంటలను పరిశీలించారు. అధికవర్షాలతో పత్తిలోపూత, పిందె రాలిపోయి రైతులకు పెట్టుబడిసైతం అందే పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎకరాకు పత్తిరైతులకు రూ.30వేలు నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలని కోరారు.

ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

వాహనదారులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

నారాయణపేట, సెప్టెంబర్ 22 : వాహనాల డ్రైవర్లు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ పోలీసులు సంతోశ్, నరేశ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని సత్యనారాయణ చౌరస్తాలో ప్రజలకు, వాహనదారులకు రోడ్డుభద్రత నియమాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహనదారులు మద్యం తాగి వాహనాలు నడపరాదని, డ్రంక్‌అండ్ డ్రైవ్ తనిఖీల్లో దొరికితే జరిమానాతో పాటు జైలుకు పంపిస్తామన్నారు. డ్రైవింగ్ చేసేవారు లైసెన్స్ కలిగి ఉండాలని, హెల్మెట్, సీటుబెల్ట్ ధరించాలన్నారు. పరిమిత వేగంతో వాహనాలు నడిపించాలని, ఆటోల్లో సీటు పర్మిట్ ఉన్నంతవరకు ప్యాసింజర్లను ఎక్కించుకోవాలన్నారు.

పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలి

ఎమ్మెల్యే శ్రీహరికి వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

మక్తల్, సెప్టెంబర్ 22 : మధ్యాహ్న భోజనం కార్మికులకు పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని ఆదివారం సీఐటీయూ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, జిల్లా సహాయ కార్యదర్శి గోవిందరాజులు మాట్లాడుతూ.. చాలీచాలని జీతాలతో విధులు నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ బిల్లులు చెల్లించడంతోపాటు కనీసవేతనం రూ.10 వేలు అందించాలన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్నభోజన కార్మికులు ప్రమీల, లక్ష్మీదేవమ్మ, మంగమ్మ, లక్ష్మి, శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థికి హాస్టల్ వసతి కల్పించాలి

మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబర్ 22 : పాలమూరు విశ్వవిద్యాలయంలో అడ్మిషన్ పొందిన ప్రతి విద్యార్థికి హాస్టల్ వసతి కల్పించాలని ఏబీవీపీ పీయూ కార్యదర్శి శివకుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం పీయూలో ఏర్పాటు చేసిన సమావేశంలో శివకుమార్ మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన సీపీగేట్ పరీక్షలో ర్యాంక్ సాధించి మొదటి కౌన్సెలింగ్ పూర్తి చేసుకుని అడ్మిషన్ పొందిన విద్యార్థులకు రెండోదశ కౌన్సెలింగ్ ప్రారంభమైనా.. అడ్మిషన్ పొందిన అభ్యర్థులకు హాస్టల్‌వసతి కల్పించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఇది విద్యార్థులకు తీవ్ర గందరగోళం, అయోమయానికి గురిచేయడమే అవుతుందన్నారు. బాలికల వసతిగృహ నిర్మాణం పూర్తయినా.. అధికారులు అందుబాటులోకి తీసుకురావడంలో తీవ్ర తాత్సారం చేస్తున్నారని ఆరోపించారు. అడ్మిషన్ పొందిన ప్రతి విద్యార్థికి నిబంధనలకు అనుగుణంగానే వసతి కల్పించడంతోపాటు మెరుగైన సౌకర్యాలు కల్పించాలన్నారు. లేదంటే ఏబీవీపీ ఆధ్వర్యంలో ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో అకాడమిక్ బ్లాక్ ప్రెసిడెంట్ వేణుగోపాల్, నాయకులు శ్రీధర్, ఓంప్రకాశ్, రవికుమార్, శ్రీనివాస్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. 9160900024 / 9640400073.

NT-331771-All

ప్రకటన

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

దేవరకద్ర : ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

అపూర్వ సమ్మేళనం

నవాబుపేట, సెప్టెంబర్ 22 : మండలంలోని కారుకొండ ఉన్నత పాఠశాల 2004-05 విద్యా సంవత్సరానికి చెందిన పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని ఆదివారం పాఠశాల ఆవరణలో ఘనంగా నిర్వహించారు. అనంతరం పూర్వ ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జీహెచ్ఎం దశరథ్‌నాయక్, పూర్వ ఉపాధ్యాయులు రాజుగౌడ్, జగదీశ్, సుధాకర్ రెడ్డి, అశోక్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

నవాబుపేట మండలం కారుకొండలో ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

చౌదర్‌పల్లిలో..

దేవరకద్ర, సెప్టెంబర్ 22 : మండలంలోని చౌదర్‌పల్లి సమీపంలోని కాకతీయ ఉన్నత పాఠశాలకు చెందిన 2005-2006 పదో తరగతి విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు.

దివిటిపల్లిలో యువకుల రక్తదానం

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 22 : మహబూబ్‌నగర్ అర్బన్ మండలంలోని దివిటిపల్లిలో ఆదివారం తలసేమియా పిల్లల సహాయార్థం స్థానిక యువకులు రక్తదానం చేశారు. మొత్తం 35మంది రక్తదానం చేసినట్లు జిల్లా రెడ్‌క్రాస్ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం చేస్తున్న యువకులు

సొంత డబ్బులతో రోడ్డు మరమతులు

భూత్పూర్, సెప్టెంబర్ 22 : మండలంలోని హస్నాపూర్ పరిధిలోని పోతుగుట్టతండాకు దాదాపు 2కిలోమీటర్ల దూరం రోడ్డుగుంతలతో అధ్వానంగా మారింది. దీంతో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి సొంత డబ్బులతో మరమ్మతు చేయించారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచులు తిరుపతయ్య, కొండన్న, సంజీవరెడ్డి, తండావాసులు రవి, రాములు శ్రీనివాస్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

అసత్యప్రచారం పోస్టుచేసిన వ్యక్తిపై కేసునమోదు

మరికల్, సెప్టెంబర్ 22 : గురువారం హైదరాబాద్‌లో జరిగిన మిలాద్‌ఉన్‌నబీ ర్యాలీలో భాగ్యలక్ష్మి ఆలయం దగ్ధం చేశారని మరికల్ గ్రూప్‌లో అసత్య ప్రచారం చేసిన వ్యక్తి రఘుగౌడ్‌పై ఆదివారం కేసునమోదు చేసినట్లు ఎస్సై మురళీ తెలిపారు. సోషల్‌మీడియాలో ఎవరైన తప్పుడు ప్రచారం చేస్తే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

క్రైం ఖబర్

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

బాలానగర్, సెప్టెంబర్ 22 : బాలానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని మోతీగణపూర్ శివారులో ఆదివారం ఓ గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహాన్ని గ్రామస్తులు గుర్తించారు. జాతీయ రహదారి బూర్గుల గేటు నుంచి మోతీగణపూర్ వెళ్లే దారిలోని ఓ పరిశ్రమ వెనుక మృతదేహాన్ని గుర్తించిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన పోలీసులు మృతురాలిని యాచకురాలిగా భావిస్తున్నారు.

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

బాలానగర్ (రాజాపూర్), సెప్టెంబర్ 22 : రాజాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఈద్గానిపల్లికి చెందిన రవి(36) శనివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్న రవి బైక్‌కు మరమ్మతులు చేయించుకువస్తానని భార్య సావిత్రికి చెప్పి ఇంట్లోంచి బయలుదేరాడు. సాయంత్రం 4గంటల ప్రాంతంలో మల్లెపల్లికి చెందిన పర్వతాలు సావిత్రికి ఫోన్‌చేసి నీభర్త రవి మల్లెపల్లి గ్రామశివారులో చెట్టుకు ఉరేసుకొని మరణించాడని సమాచారం అందించారు. ఆదివారం మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రైలు ఢీకొని వ్యక్తి మృతి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 22 : మహబూబ్‌నగర్ రూరల్ మండలంలోని కోటకదిర సమీపంలో గుర్తు తెలియని రైలు ఢీకొట్టడంతో వ్యక్తి మృతి చెందినట్లు రైల్వే ఎస్సై సయ్యద్ అక్బర్ తెలిపారు. కోటకదిర నుంచి దేవరకద్ర వెళ్లే రూట్లో రైలు ఢీకొని పట్టాలకు సమీపంలో ఆదివారం వ్యక్తి మృతదేహం కనిపించినట్లు వచ్చిన సమాచారం మేరకు వెళ్లి పరిశీలించి వివరాలు సేకరించామన్నారు. మృతి చెందిన వ్యక్తి వయస్సు దాదాపు 55సంవత్సరాలకు పైబడి ఉంటుందని, రెడిమేడ్ తెల్లటి టీషర్టు, షార్ట్ ధరించి ఉన్నట్లు తెలిపారు. ఎవరైనా గుర్తిస్తే రైల్వే పోలీసులను సంప్రదించాలని, మృతదేహాన్ని జిల్లా దవాఖాన మార్చురీలో భద్రపర్చినట్లు పేర్కొన్నారు.

చికిత్స పొందుతూ..

మూసాపేట, సెప్టెంబర్ 22 : మండలంలోని సూర్తితండాకు చెందిన ముడావత్ పాండునాయక్(36) మేస్త్రీ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కుటుంబ కలహాలతో మానస్తాపానికి గురైన పాండునాయక్ ఈనెల 15వ తేదీన రాత్రి ఇంట్లో గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు మహబూబ్‌నగర్ జిల్లా దవాఖానకు తరలించారు. పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తరలించాలని సూచించారు. వెల్‌నెస్ దవాఖానలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు. మృతుడికి భార్య పద్మ, కుమారుడు, కూతురు ఉన్నారు.

చిన్నజట్రంలో మహిళ..

బాలానగర్, సెప్టెంబర్ 22 : హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న నారాయణపేట జిల్లా చిన్నజట్రం గ్రామానికి చెందిన బాలస్వామి, ఆయన భార్య మధు సమీప బంధువు అంత్యక్రియలకు వైక్‌పై హైదరాబాద్ నుంచి స్వగ్రామం వెళ్తున్నారు. ఈనెల 19న ఉదయం పది గంటల ప్రాంతంలో కేతిరెడ్డిపల్లి సమీపంలో వెళ్తుండగా బైక్‌పై నుంచి మధు జారిపడి తీవ్ర గాయాలపాలైంది. గాంధీ దవాఖానలో చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందినట్లు ఎస్సై తెలిపారు.

బాధిత కుటుంబాలకు మాజీ ఎమ్మెల్యే పరామర్శ

బాధితులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

దేవరకద్ర, సెప్టెంబర్ 22 : మండలంలోని చిన్నరాజమూర్‌లో బీఆర్ఎస్ కార్యకర్తల కుటుంబాలను మాజీఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆదివారం పరామర్శించారు. బీఆర్ఎస్ కార్యకర్త రాఘవులుకు ఇటీవల గుండె సంబంధి తఆపరేషన్ జరిగింది. అలాగే మాజీ వార్డుసభ్యుడు ఆంజనేయులు భార్య బాలామణి, బీఆర్ఎస్ కార్యకర్త వెంకటయ్య సర్జరీపూర్తి చేసుకుని చికిత్స పొందుతుండగా, బాధితులను ఆల వెంకటేశ్వర్ రెడ్డి పరామర్శించి అండగా ఉంటామని చెప్పారు. ఆల వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు జెట్టి నరసింహా రెడ్డి, నాయకులు శ్రీకాంత్‌యాదవ్, కొండారెడ్డి, డోకూర్ నరేందర్‌రెడ్డి, రాజు, బాలరాజు, నరేశ్ తదితరులు ఉన్నారు.

మ్యూజిక్ టీచర్‌కు ఉత్తమఉపాధ్యాయ పురస్కారం

పురస్కారం అందుకుంటున్న మ్యూజిక్ టీచర్ శ్యామల

మహ్మదాబాద్, సెప్టెంబర్ 22 : ప్రజాకవి కాళోజి, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ, ఆచార్య పాకాల జయంతి సందర్భంగా తెలంగాణ సాహితీతి సాంస్కృతిక ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలను ప్రదానం చేశారు. మండలంలోని నంచర్ల గురుకుల పాఠశాలలో పనిచేస్తున్న మ్యూజిక్‌టీచర్ శ్యామల ఉత్తమఉపాధ్యాయ పురస్కారం ఉస్మానియా విశ్వవిద్యాలయం, పాలమూరు యూనివర్శిటీ అధికారుల చేతులమీదుగా ఆదివారం అందుకున్నారు. ఈ సందర్భంగా గురుకుల ఉపాధ్యాయ బృందం తదితరులు అభినందించారు.

పీఆర్టీయూ జిల్లా నూతన కార్యవర్గం ఎన్నిక

జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మదన్‌మోహన్, సుధాకర్‌రెడ్డి

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, సెప్టెంబర్ 22 : పీఆర్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా మదన్‌మోహన్‌యాదవ్, సుధాకర్ రెడ్డి ఎన్నిక య్యారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఏనుగొండ వద్దగల ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించారు. ఎన్నికల పరిశీలకుడిగా నిజామాబాద్ అధ్యక్ష, కార్యదర్శులు మోహన్‌రెడ్డి, కిషన్ వ్యవహరించారు. గతంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులుగా కొనసాగిన నారాయణగౌడ్, రఘురాం రెడ్డి స్వల్ప ఓట్లతేడాతో ఓడిపోయారు. అధ్యక్ష పదవిని 7ఓట్లు, ప్రధాన కార్యదర్శి పదవి 25 ఓట్ల తేడాతో గెలుచుకుని నూతనంగా ఎన్నికైన అధ్యక్ష కార్యదర్శులు దక్కించుకున్నారు. కార్యక్రమంలో పీఆర్టీయూ రాష్ట్రమాజీ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి చెన్నకేశవ రెడ్డి జిల్లా మాజీ అధ్యక్షుడు వెంకట్ రెడ్డి, తిమ్మారెడ్డి, బుచ్చారెడ్డి, రాజశేఖర్‌గౌడ్, సురేశ్‌రెడ్డి, ఎల్లయ్య, జైపాల్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి పాల్గొన్నారు.

హన్వాడ కమిటీ ఎన్నిక

హన్వాడ, సెప్టెంబర్ 22 : పీఆర్టీయూ మండల కమిటీని అదివారం మండల కేంద్రంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా వెంకటేశ్వర్ రెడ్డి ప్రధాన కార్యదర్శిగా పర్వతాలు, గౌరవఅధ్యక్షుడిగా అలీం తో పాటు 10మంది సభ్యులుగా ఎన్నుకున్నట్లు సంఘం నాయకులు తెలిపారు.

మాగనూరులో..

మాగనూరు/కృష్ణ, సెప్టెంబర్ 22 : పీఆర్టీయూ కృష్ణ మండల నూతనకమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శేఖర్, గౌరవాధ్యక్షుడిగా శివరాజ్, ప్రధాన కార్యదర్శిగా అజయ్, అసోసియేట్ అధ్యక్షుడిగా అనిల్‌కుమార్ పాటిల్, ఉపాధ్యక్షుడిగా తిరుమలరావు, మహిళా ఉపాధ్యక్షులుగా షాహీన్, పుష్ప, కార్యదర్శిగా రామకృష్ణను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నర్సింహా రెడ్డి, ప్రధాన కార్యదర్శి జనార్ధన్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడిగా తిరుపతి, వివిధ మండలాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా రఘువీర్, బలరాం, తిమ్మన్న, రాష్ట్ర బాధ్యులు శ్రీనివాస్‌రెడ్డి, నాగరాజు పాల్గొన్నారు.

విద్యార్థులకు బహుమతులు అందజేత

ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులతో చిన్నజీయర్ స్వామి

నారాయణపేట టౌన్, సెప్టెంబర్ 22 : ప్రజ్ఞావికాస్ ఆధ్వర్యంలో మాతృభూమికి, జాతీయ నాయకులకు, దేశసరిహద్దుల్లో సైనికులకు కృతజ్ఞతలు అనే అంశాలపై ఇటీవలే ఇంగ్లిష్, తెలుగు మీడియంలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు జిల్లా స్థాయి వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. శనివారం రాత్రి ముచ్చింతల్‌లో జరిగిన కార్యక్రమంలో త్రిదండి చిన్నజీయర్‌స్వామి ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందించి అభినందించారు. ఈ పోటీల్లో పట్టణానికి చెందిన హంసవాహినిస్కూల్ కృష్ణ గోకులం, సాయిస్కూల్‌కు చెందిన ఎల్లప్ప, మహేందర్‌నాయక్, సోనూరా థోడ్, లావణ్య, భాను, మీనాక్షి, దీపిక, అర్పిత, నితిన్‌కుమార్ ప్రతిభ చాటి నగదు పురస్కారాలకు ఎంపికయ్యారు. కార్యక్రమంలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, కార్యదర్శి రాజేశ్‌కుమార్, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు నరసింహ, సుజాత, నమ్రతతోపాటు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాలను అందజేస్తున్న దృశ్యం

పాలమూరు, సెప్టెంబర్ 22 : జిల్లా కేంద్రంలోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ భవనంలో ఆదివారం తెలంగాణ మహిళా సాహిత్య సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులకు పురస్కారాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కశిరెడ్డి వెంకట్‌రెడ్డి హాజరై 25 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానించారు.

జడ్చర్ల తాసీల్దార్ సస్పెన్షన్?

జడ్చర్ల, సెప్టెంబర్ 22 : జడ్చర్ల తాసీల్దార్ సత్యనారాయణరెడ్డి సస్పెండ్ అయినట్లు తెలిసింది. భూదాన్ భూమికి సంబంధించిన కేసు విషయంలో హైదరాబాద్‌లోని సీసీఎల్‌లో విచారణ కోసం శనివారం తాసీల్దార్ సత్యనారాయణరెడ్డి వెళ్లాల్సి ఉండగా, డిప్యూటీ తాసీల్దార్ రాజీ వెళ్లారు. తాసీల్దార్ హాజరు కాకపోవడంపై ఆగ్రహించిన సీసీఎల్ ప్రిన్సిపల్ సెక్రటరీ నవీన్‌మిట్టల్ తాసీల్దార్‌పై క్రమశిక్షణ చర్యల్లో భాగంగా సస్పెండ్‌కు ఆదేశించారు. దీంతో తాసీల్దార్ సత్యనారాయణరెడ్డిని సస్పెండ్ చేస్తూ ఆదివారం ఉత్తర్వులు వచ్చినట్లు విశ్వసనీయ సమాచారం.

జిల్లా మహాసభల ఆహ్వాన కమిటీ ఏర్పాటు

జడ్చర్ల, సెప్టెంబర్ 22 : సీపీఎం జిల్లా మహాసభల ఆహ్వాన సంఘం కమిటీని ఏర్పాటు చేసినట్లు సీపీఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాగర్ తెలిపారు. ఆదివారం జడ్చర్లలోని అంబేద్కర్ కళాభవన్‌లో సీపీఎం మహాసభల ఆహ్వాన సంఘం కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా మహాసభలను అక్టోబర్ 26, 27 తేదీల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆహ్వాన సంఘం అధ్యక్షుడిగా సత్తయ్య, ప్రధాన కార్యదర్శిగా దీప్లానాయక్, కోశాధికారిగా జగన్‌తోపాటు 25మందిని ఎన్నుకోవడం జరిగిందన్నారు.

అన్నివిధాలా అండగా ఉంటాం

మరికల్, సెప్టెంబర్ 22 : మండల కేంద్రంలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన వడ్లభాస్కర్ కుటుంబాన్ని ఆదివారం బీఆర్ఎస్ జిల్లా నాయకులు రాజవర్ధన్‌రెడ్డి, రవికుమార్ యాదవ్, మండల అధ్యక్షుడు తిరుపతయ్య పరామర్శించారు. ఈ సందర్భంగా రాజవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీలో అంకిత భావంతో పనిచేసే భాస్కర్ మృతి తీరని లోటన్నారు. ఆయన కుటుంబాన్ని అన్నివిధాలుగా అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు చంద్రశేఖర్, నాయకులు శ్యాంసుందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

మరికల్‌లో స్వచ్ఛత హీ సేవ

మరికల్, సెప్టెంబర్ 22 : సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 2 వరకు నిర్వహిస్తున్న స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా ఆదివారం మండల కేంద్రంలోని హరిజన్‌వాడలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ గోపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్త, కాలనీ వాసులు పాల్గొన్నారు.

సభ విజయవంతం

మరికల్, సెప్టెంబర్ 22 : సుప్రీంకోర్టు ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో ఆదివారం మరికల్‌లో నిర్వహించిన విజయోత్సవ సభ విజయవంతమైందని టీఎంఆర్ పీస్ రాష్ట్ర కార్యదర్శి జోగు రామస్వామి, ఉపాధ్యక్షుడు బాలరాజు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మట్లాడుతూ.. ఈ సభను విజయవంతం చేసిన దళిత బహుజనులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో నాయకులు బాలకృష్ణ, గోవర్ధన్, వెంకటయ్య, మాసన్న తదితరులు పాల్గొన్నారు.

లోవోల్టేజీ సమస్యను నివారించండి

ధన్వాడ, సెప్టెంబర్ 22 : ఇటీవల కురిసిన వర్షాలకు విద్యుత్ సమస్యలు ఏర్పడి పలు గ్రామాల్లో లోవోల్టేజీ సమస్య తీవ్రంగా ఉందని మండల బీఆర్ఎస్ నాయకులు నర్సింహా రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అధికారులు స్పందించి లోవోల్టేజీ సమస్యను తీర్చాలని, పలుమార్లు విద్యుత్ అంతరాయం ఏర్పడడంతో మోటర్లు కాలిపోయే ప్రమాదముందన్నారు. అధికారులు స్పందించి లోవోల్టేజీ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

పత్తికి గిట్టుబాటు ధర కల్పించాలి

ధన్వాడ, సెప్టెంబర్ 22 : ఇటీవల కురిసిన వర్షాలకు రైతులు పంటలను నష్టపోవడం జరిగిందని, పండిన అరకోర పంటలకు ప్రభుత్వం గిట్టుబాటు ధరలు కల్పించి రైతులను ఆదుకోవాలని మండల బీఆర్ఎస్ నాయకుడు గున్ముక్ల మాజీ ఎంపీటీసీ సుధీర్‌కుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులకు పత్తిపంటకు కనీస మద్దతు ధర రూ.7500 నుంచి రూ.10వేల ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే పంటలు నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.10వేలు ఇచ్చి రైతులను ఆదుకోవాలని కోరారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

బాలానగర్ (రాజాపూర్), సెప్టెంబర్ 22 : రాజాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని యారోనిపల్లి శివారులో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టరును ఆదివారం పట్టుకున్నట్లు ఎస్సై రవి తెలిపారు. ఈద్గానిపల్లిలో అనుమతి లేకుండా ఇసుక తరలిస్తుండగా పట్టుకొని ట్రాక్టర్‌తోపాటు డ్రైవర్, యజమాని కృష్ణయ్యను పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

విద్యార్థులకు కరాటే పోటీలు

మక్తల్, సెప్టెంబర్ 22 : కరాటే ఆత్మరక్షణకు ఎంతో ఉపయోగపడుతుందని డ్రాగన్ చోటేఖాన్ కరాటే డూ ఇండియా వ్యవస్థాపక అధ్యక్షుడు శాలంబిన్ ఉమర్ అన్నారు. ఆదివారం మక్తల్‌లో విద్యార్థులకు కరాటే పోటీలను నిర్వహించారు. అనంతరం ప్రతిభ కనబర్చిన వారికి బెల్టులను అందజేయడం జరిగిందన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుదాం

మూసాపేట(అడ్డాకుల), సెప్టెంబర్ 22 : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుదామని ఎల్‌అండ్‌టీ టోల్‌ప్లాజా ప్రాజెక్టు మెనేజర్ దీప మాదియ సూచించారు. ఆదివారం ఎన్‌హెచ్‌ఐ ఆదేశాల మేరకు స్వచ్ఛత హీ సేవ కార్యక్రమంలో భాగంగా టోల్‌ప్లాజా వద్ద పరిసరాలను పరిశుభ్రత కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వాహనదారులు రోడ్లపై చెత్తాచెదారం వేయకూడదని, పార్కింగ్ స్థలంలో వాహనాలు నిలిపి అక్క